రేపటినుంచి నామినేషన్ల ప్రక్రియ

- 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఆర్వో కేంద్రాల్లోకి అభ్యర్థితోపాటు నలుగురికి అనుమతి
- మే 13 న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాబోతుందని, 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచందర్‌రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించనున్నామని, ఇందుకు మీడియా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. 26న నామినేషన్ల స్క్రూట్నీ చేస్తారని, 29 వరకు నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. 15 రోజులపాటు అభ్యర్థుల ప్రచారాల తర్వాత మే 13 న పోలింగ్ ఉంటుందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందించే కౌంటర్లు, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్లు, కంట్రోల్ రూం, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని వివరించారు.

ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

సువిధ పోర్టల్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అప్లికేషన్ సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి, రిటర్నింగ్ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఒకరోజు ముందే అభ్యర్థి తన పేరుతో ఎన్నికల ఖర్చు కోసం బ్యాంకు ఖాతా ప్రారంభించి, ఖాతాకు సంబంధించిన వివరాలు ఆర్వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒక ప్రతిపాదకుడిని, ఇండిపెండెంట్లు, రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు పదిమంది ప్రతిపాదకుల సంతకాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతిపాదకులందరూ సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఓటర్లుగా ఉండాలన్నారు. అభ్యర్థులు నామినేషన్‌తోపాటు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెక్, చలానా రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలని వివరించారు.

నామినేషన్ దాఖలుకు ఐదుగురికే అనుమతి

ఈ నెల 18 నుంచి 25 తేదీ వరకు నామినేషన్ స్వీకరణ ఉంటుందని, ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. నామినేషన్ తోపాటు ఆస్తులు, అప్పులు, కేసులు, విద్యార్హత పత్రాలను దాఖలు చేయాలని సూచించారు. ప్రతిరోజూ నామినేషన్ పత్రాల తోపాటు అఫిడవిట్ పత్రాలను ఆర్వో ప్రదర్శిస్తారని చెప్పారు. అభ్యర్థి అఫిడవిట్ పత్రాలను 24గంటల్లోనే సీఈవో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల్లోకి 3 వాహనాలు, అభ్యర్థితోపాటు నలుగురికి అనుమతి ఉందన్నారు.

పటిష్ట బందోబస్తు, నిఘా...

ఓటర్లను డబ్బులు, మద్యం, కానుకలతో ప్రలోభపెట్టేందుకు జరిగే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు నిఘా బృందాలు, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వేలియన్స్‌లో ఖర్చుల పర్యవేక్షణ బృందాలు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాయని కలెక్టర్ వివరించారు. జిల్లా సరిహద్దుల్లో 7 చెక్ పోస్టులు, 5 డైనమిక్ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి, పటిష్ట నిఘా, చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పటివరకు 19 కేసులు, రూ.28,89,830 నగదు సీజ్..

ఎన్నికల కోడ్ అమల్లో వచ్చిననాటి నుంచి 19 కేసులు నమోదు చేసి రూ. 28,89,830 నగదు సీజ్ చేశామని చెప్పారు. 13 మంది విజ్ఞప్తులను పరిశీలించి, 11 మందికి చెందిన రూ. 15,21,730 నగదు రిలీజ్ చేశామని తెలిపారు. ఇంకా రూ.13,68,100 నగదు పెండింగ్‌లో ఉందన్నారు. 98,490లీటర్ల మద్యం సీజ్ చేశామని, వాటి విలువ రూ. 93,57,003 ఉంటుందని తెలిపారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 102 కేసులు నమోదయ్యాయని తెలిపారు. నేతలపై నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్

ఉచిత విద్యుత్ అమలు చేయాలి

- జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్
- 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడినా బిల్లు వస్తున్నది
- జడ్పీ సమావేశంలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16 : గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వాడినా బిల్లులు వస్తున్నాయని అధికారులపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు కరెంట్ బిల్లు చెల్లించవద్దని చెప్పినా అధికారులు మాత్రం బిల్లులు వేస్తున్నారన్నారు. మెదక్ జడ్పీ సమావేశం మంగళవారం జడ్పీ వైస్‌పర్సన్ హేమలతాగౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, ఆదనపు కలెక్టర్ రమేశ్ హాజరయ్యారు. అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం వర్తింపచేయడం లేదని ట్రాన్స్‌కో అధికారులపై ఎమ్మెల్సీలతోపాటు వైస్‌పర్సన్ అగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ ఉచిత కరెంట్ అమలు చేయాలని అధికారులకు సూచించారు. మనఊరు– మనబడి పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సభ్యులు కోరారు. నిజాంపేటలో పాఠశాల భవనం, కొల్చారం ఎంపీడీవో భవనాలను ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని కోరారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, విద్యాశాఖలపై చర్చించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తేమశాతం 16 ఉంటేనే కొనుగోలు చేస్తాం

నర్సాపూర్, ఏప్రిల్ 16 : ధాన్యంలో తేమశాతం 16శాతం కంటే తక్కువ ఉంటేనే కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వరి కుప్పలను పరిశీలించి, వాటి తేమశాతం పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతనే కేంద్రాలకు తేవాలని సూచించారు. నిర్దేశించిన తేమశాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సీఈవోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, పౌరసరఫరాల శాఖ డీఎం తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో డీఏవో తనిఖీ

చిలిపిచెడ్, ఏప్రిల్ 16 : మండలంలోని పీఏసీఎస్, ఎఫ్‌పీవో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తనిఖీ చేశారు. సోమక్కపేట, ఫైజాబాద్ గ్రామాల్లోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాలను మంగళవానం ఏడీఏ, ఏవోలతో కలిసి తనిఖీ చేశారు. సేవా కేంద్రంలో స్టాక్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చేయాలని, బిల్ బుక్‌లను నిర్వహించాలని సూచించారు. కల్తీ మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, ఏవో బాల్‌రెడ్డి, ఏఈవో భూపాల్, పీఏసీఎస్ సీఈవో పోచయ్య, యాసిన్, రమేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

కోలపల్లి చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16 : మండలంలోని కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నాందేడ్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న షేక్ సమీర్ వాహనం తనిఖీ చేయగా, ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును గుర్తించారు. నగదును జీప్ చేసి సంగారెడ్డి గ్రీవెన్స్‌కు తరలించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

బూర్గుపల్లిలో సీఐఎస్ఎఫ్, పోలీసుల కవాతు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా ఎస్పీ బాలస్వామి ఆదేశాలతో మంగళవారం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఆయా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్‌గా 'మామిళ్ల'

మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్‌గా కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్లుగా గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, సాయిలు, జుబేర్ అహ్మద్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కన్వీనర్, కో కన్వీనర్లను ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, విశ్వం, జయరాజ్, కిశోర్, సుంకయ్య, మాజీ కౌన్సిలర్లు చంద్రకళ, నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జగపతి, నాయకులు ప్రభురెడ్డి, సుమన్, నగేశ్, కిషన్ పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో మెదక్ విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16: ఈ నెల 4న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జానపద బృంద గానంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థులు శ్రీధర్ నాయకత్వంలో మనోజ్ఞ, విద్య, స్వాతిక, రమణి, కృపలత పోటీల్లో పాల్గొన్నారు. ఈ నెల 26న ఓయూ వైస్‌చాన్స్‌లర్ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు.

గోనె సంచులకు నిప్పు పెట్టిన దుండగులు

నిజాంపేట, ఏప్రిల్ 16 : మండలంలోని రాంపూర్‌లో రామాయంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ కోసం నిల్వ ఉంచిన గోనె సంచులకు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. దాదాపుగా 3 వేల వరకు గోనె సంచులు అగ్నికి కాలిపోయాయి. సుమారు రూ.2.5 లక్షల నష్టం వాటిల్లింది. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

వడ్లకుప్పను ఢీకొని బొలేరో బోల్తా

- రోడ్లపై ధాన్యం ఆరబెట్ట వద్దని పోలీసులు చెప్పినా వినని రైతులు

రామాయంపేట, ఏప్రిల్ 16 : కోళ్లతో వస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడ్డ ఘటన రామయంపేట జాతీయ రహదారి 44వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రామాయంపేట నుంచి ఫౌల్ట్రీ కోళ్లను తీసుకుని బొలేరో వాహనం కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్తున్నది. జాతీయ రహదారి మార్గమధ్యలో దామరచెర్వు వద్ద రోడ్లపై ధాన్యం ఉండడంతో కుప్పను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కోళ్లు మృతి చెందగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ధాన్యం రోడ్లపై పోయవద్దని హెచ్చరించినా పోలీసుల మాటలను పెడచెవిన పెట్టి రోడ్లపైనే ఆరబోయడంతో రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

చెల్లాచెదురుగా పడిన కోళ్లు

రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్
- ఎన్నికల నిర్వహణపైరాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛా వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 18న నోటిఫికేషన్ ప్రకటించి, 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 26న నామినేషన్ల స్క్రూట్నీ, 29న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు మెదక్‌లోని కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు అందజేయాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామినేషన్ వేసే ముందు హెల్ప్ డెస్క్‌లో తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు నామినేషన్ సెట్లు దాఖలు చేయవచ్చన్నారు. అఫిడవిట్‌లోని ఖాళీలు పూరించాలన్నారు. క్రిమినల్ కేసులు, కన్విక్షన్ కేసుల వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో మూడుసార్లు పబ్లిష్ చేయాలన్నారు. అభ్యర్థులు కొత్త ఖాతా తెరిచి, దాని నుంచే చెల్లింపులు చేయాలన్నారు. నామినేషన్ కేంద్రానికి 100మీ దూరంలో 3 వాహనాలకు అనుమతిస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు

కలెక్టరేట్ ఆవరణలో బారికేడ్ల ఏర్పాటు, బందోబస్తుపై చర్చిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టరేట్‌లో బారికేడ్ల, మీడియా పాయింట్ ఏర్పాటు
- పనులను పరిశీలించిన కలెక్టర్

మెదక్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను ఈ నెల 18 నుంచి కలెక్టరేట్‌లో స్వీకరిస్తున్న నేపథ్యంలో మంగళవారం మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జైచంద్రారెడ్డి, మెదక్ డీఎస్పీ రాజేశ్‌తో కలిసి బారికేడ్ల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, మీడియా పాయింట్ ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయ సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఇతరులను ప్రవేశించకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు 30 నిమిషాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

చెక్‌పోస్టులను పెంచుతాం

- ఎస్పీ బాలస్వామి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చెక్‌పోస్టుల సంఖ్యను పెంచుతామని ఎస్పీ బాల స్వామి తెలిపారు. మంగళవారం రాత్రి నాందేడ్-అకోలా 161వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన కోలపల్లి పాత టోల్‌ప్లాజా చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి చెక్‌పోస్టులు కీలకపాత్ర వ్యవహరిస్తాయన్నారు. చెక్‌పోస్టులో రిజిస్టర్లను పరిశీలించిన, అనంతరం జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. జిల్లాలో 7 చెక్‌పోస్టులు ఉన్నాయని, అదనంగా మూడు చెక్‌పోస్టులను పెంచుతామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువగా నగదును తీసుకెళ్లొద్దని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాజేశ్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్సై శంకర్ తదితరులు ఉన్నారు.

ఫీజుల కోసం విద్యార్థులను వేధించొద్దు

- నర్సాపూర్ జడ్జి అనిత

నర్సాపూర్, ఏప్రిల్ 16 : ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తూ.. పరీక్షలకు ఆటంకం కలిగిస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని జూనియర్ సివిల్ జడ్జి అనిత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి విద్యార్థికి విద్యను పొందే హక్కు ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజుల పేరుతో విద్యార్థులను పరీక్షలకు వెళ్లకుండా ఆటంకం కల్పించొద్దని హెచ్చరించారు. ఇటీవల వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను పూర్తి ఫీజులను చెల్లించకుంటే పరీక్షలు రాయనీయమని బెదిరిస్తున్నట్లు తల్లిదండ్రులు మండల లీగల్ సర్వీస్ కమిటీకి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. దీనిపై జూనియర్ సివిల్ జడ్జి అనిత స్పందించారు. పరీక్షల సమయంలో ఫీజుల కోసం ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సమాచారం ఇవ్వాలని ఎంఈవో బుచ్చానాయక్‌కు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ప్రైవేట్ స్కూళ్లను సందర్శించి పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు.

కోచ్‌లకు ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16 : జిల్లాలో మే 1 నుంచి 31 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఇవ్వడానికి క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడాకారులు, పీఈటీలు కోచ్‌గా విధులు నిర్వహించడానికి 18లోగా జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9347344440, 9493594388 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీని తరిమికొట్టాలి

- మెదక్ గడ్డ బీఆర్ఎస్ అడ్డా
- కాంగ్రెస్ గ్యారెంటీలను మరిచింది
- బీజేపీ తెలంగాణాకు పైసా ఇవ్వలేదు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- చేగుంటలో బీఆర్ఎస్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

చేగుంట, ఏప్రిల్16 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. రఘునందన్‌రావు మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని, మెదక్ పార్లమెంట్ గడ్డ బీఆర్ఎస్ అడ్డా అన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలి వేశారని విమర్శించారు. చేగుంటలోని వడియారం శివారులో ఎస్ఎల్‌బీఎన్ గార్డెన్‌లో మంగళవార చేగుంట, నార్సింగి మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. దుబ్బాక ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిన రఘునందన్‌రావును ఓడిపోవడం ఖాయమన్నారు. మెదక్ గడ్డ మీద గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందన్నారు. అబద్దాలు చెప్పి మోసం చేసిన రఘునందన్‌రావుకు ఓటమి భయం పుట్టుకుందని, భయంతోనే వెంకట్రామిరెడ్డిపై అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గెలిచే దమ్ము లేక వెంకట్రామిరెడ్డిపై కేసులు పెట్టాలని మాట్లాడుతున్నారని విమర్శించారు. దుబ్బాక ప్రజలు ఓడించినా రఘునందన్‌రావు బుద్ధి మారలేదన్నారు. దొంగ హామీలు ఇచ్చి మోసం చేసిన రఘునందన్‌రావుపై కేసు పెట్టాలన్నారు. అక్రమాలకు పాల్పడే బీజేపీ,కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. కొందరు నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారినా నష్టం లేదని, నిజమైన కార్యకర్తలు పార్టీతోనే ఉంటారని తెలిపారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశానని ప్రభాకర్‌రెడ్డి గుర్తు చేశారు. ఫ్లైఓవర్లు, అండర్ పాసింగ్ బిడ్జి నిర్మాణాలు, రహదారుల అభివృద్ధి, సిద్దిపేట, మెదక్‌కు రైలు సౌకర్యం, సిద్దిపేటకు కేంద్రీయ విద్యాలయం తెచ్చానని వివరించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసేంతవరకు నిలదీయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పదేండ్లలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్లు నిర్మించి, మెదక్ జిల్లాకు సాగునీళ్లు తెచ్చుకున్నామని తెలిపారు. సిద్దిపేట అభివృద్ధిలో కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి కీలక పాత్ర పోషించారని, ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు.

సేవ చేయడానికే వస్తున్నా ...

★ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

డబ్బు సంపాదించడానికి, పైరవీలు చేయడానికి రాజకీయాల్లోకి రావడం లేదని, ప్రజాసేవ చేయడానికే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. ఎంపీగా గెలిపించిన నెల రోజుల్లో పీవీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి, యువతకు ఉద్యోగ, ఉపాధి శిక్షణ ఇచ్చి అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు.

మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

భారీ మెజార్టీతో గెలిపించాలి

హవేళీఘనపూర్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చ